క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులతో పాటు వివిధ శాఖల అధికారులు తగిన సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

ప్రజలకు ముప్పుగా మారిన కొత్త చట్టాలు

ఒంగోలు టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలు ప్రజలకు ముప్పుగా మారాయని ప్రజాతంత్ర మేధావుల వేదిక కన్వీనర్, ప్రముఖ న్యాయవాది పంగులూరి గోవిందయ్య ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టాలను నిరసిస్తూ స్థానిక ఈమనిపాలెం తరిమెల నాగిరెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. అనేక మంది న్యాయనిపుణులు వీటిని కొత్త సీసాలో పాత సారా అని అభివర్ణిస్తున్నప్పటికీ ఈ చట్టాలు ప్రజల హక్కులకు తీవ్ర విఘాతం కలిగించబోతున్నాయని చెప్పారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా ప్రజాతంత్రవాదులంతా గళం విప్పాలని పిలుపునిచ్చారు. భారతీయత పేరుతో తెచ్చిన ఈ చట్టాలు ఆరెస్సెస్ మతోన్మాద, హింసాత్మక కార్యకలాపాలకు చట్టబద్ధత కల్పించే విధంగా ఉన్నాయని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర కోశాధికారి డీవీఎస్ స్వామి అన్నారు. న్యాయవర్గాలలోగానీ, పార్లమెంటులోగానీ చర్చించకుండా తెచ్చిన ఈ చట్టాలను వ్యతిరేకించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేసు నమోదు, అరెస్టు, విచారణ, సోదాల వంటి విషయంలో పోలీసులకు అసాధారణ అధికారం కట్టబెట్టడం ద్వారా దేశాన్ని పోలీస్ రాజ్యంగా మార్చాలని చూస్తున్నారని చెప్పారు. ఈ సభకు ఓపీడీఆర్ జిల్లా నాయకులు పి.సుబ్బారావు అధ్యక్షత వహించగా, వివిధ ప్రజా సంఘాల నాయకులు కత్తి పేరయ్య, కె.సుబ్బారావు, ఎస్.లలితకుమారి, ఎంఎస్ సాయి, విజయసారథి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సిటీ: నగరంలోని 11కేవీ జెడ్పీ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆపరేషన్స్ టౌన్ జి.వినయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్ఎంసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి



ఎస్ఎంసీ ఎన్నికలపై సూచనలిస్తున్న ఎంఈవో పద్మావతి

కొత్తపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో 1, 2 తులసీ కుమారి, పద్మావతిలు హెచ్ఎంలను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)పై సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో 52 పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నోటిఫికేషన్, ఓటర్ల లిస్టు విడుదల చేయడం జరిగిందని, ఐదో తేదీ అభ్యంతరాలు తీసుకోవడం, ఫైనల్ లిస్ట్ ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 8న ఎన్నికలు జరుగుతాయన్నారు. హెచ్ఎంల ప్రశ్నలపై చర్చించారు. వీటితో పాటు టీచర్స్, స్టూడెంట్స్ అటెండెన్స్, నో ఆధార్ స్టూడెంట్స్, ఎంఈవో విజిట్స్, ఏపీపీ, వివిధ రకాల అంశాల గురించి చర్చించారు. ఎస్ఎంసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.



ఒంగోలు నగరంలోని శ్రీనివాసహాలు రోడ్డు పక్కన మురుగు, చెత్త



కరుణాకాలనీలో నిల్వ ఉన్న చెత్త



బలరాంకాలనీ వద్ద...

నగరం.. దుర్భరం..!

- ఒంగోలు నగరంలో అధ్వానంగా పారిశుధ్యం
- రోడ్ల పక్కన ఎక్కడ చూసినా చెత్తకుప్పలు
- వ్యర్థాలతో నిండిపోయిన కాలువలు
- పోతురాజుకాలువ నిండా ప్లాస్టిక్ సంచులు
- వర్షం కురిస్తే.. రోడ్లపైకి వచ్చేవారు ముక్కుమూసుకోవాల్సిందే...
- ప్రభుత్వం మారిన తర్వాత అటకెక్కిన పారిశుధ్య పనులు

ఒంగోలు అర్బన్:

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా రోడ్ల పక్కన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ వాహనాలు వచ్చేవి. మైకులతో ప్రచారం చేసి మరీ ఇళ్లలోని చెత్తను సేకరించి డంపింగ్ కేంద్రాలకు తరలించేవి. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. చెత్త సేకరణ, తొలగింపు పనులు అటకెక్కడంతో నగరంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. చెత్త సేకరణ వాహనాలు అప్పుడప్పుడూ.. అక్కడక్కడా తప్ప రోజూ రావడం లేదు. పారిశుధ్యంపై పర్యవేక్షణ కనిపించడం లేదు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరించడం నామమాత్రంగానే సాగుతోంది. రోజు మార్చి రోజు, రెండు రోజులకు ఒకసారి మాత్రమే ఇంటింటికీ వాహనాలు వచ్చి చెత్త సేకరణ చేస్తున్నాయి. అంతేగాకుండా సేకరించిన చెత్తను అదే వీధిలో ఏదో ఒక ఖాళీ స్థలంలో డంప్ చేస్తున్నారు. కేవలం అధికార పార్టీ నేతల గృహాలకు మాత్రం విధిగా పారిశుధ్య కార్మికులను పంపించడం, వారి ఇళ్లు ఉన్న వీధుల్లోనే మురుగు కాలువలు శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలు తొలగించడం, రోడ్లు ఊడ్చడం వంటి పనులు చేస్తున్నారు. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పూర్తిగా అధికార పార్టీ నేతల సేవలో తరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాలు, మురికివాడల్లో పరిస్థితి దుర్భరంగా మారింది. గృహాల మధ్య, రోడ్డు పక్కన ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ పరిస్థితుల్లో వర్షం కురిస్తే నగర ప్రజలు నరకం చూస్తున్నారు. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలక రోడ్లపైకి వర్షం నీరు పొంగిపొర్లుతోంది. వర్షం వెలిసిన తర్వాత కూడా కొన్ని రోజుల పాటు రోడ్డంతా నల్లటి మురుగుతో నడిచేందుకు వీలులేకుండా మారుతోంది. వాహనాల టైర్లు కూడా జారిపోయి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. వర్షాల నేపథ్యంలో ముందస్తుగా మురుగు కాలువల్లో పూడికలు తీయాల్సి ఉండగా, ఆ పనులను గాలికొదిలేశారు. ఫలితంగా కాలువలన్నీ చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఏ ఒక్క కాలువలోనూ మురుగునీరు ముందుకు కదలడం లేదు. దీనివలన దోమల ఉత్పత్తి కూడా పెరిగి నగరవాసులు రోగాల బారిన పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు కనీసం ప్రజల ఆరోగ్యాన్నయినా దృష్టిలో ఉంచుకుని నగరంలో పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువలో వ్యర్థాలతో పేరుకుపోయిన మురుగు



రోడ్డుపైకి చేరిన కాలువలోని మురుగునీరు



60 అడుగుల రోడ్డులో భారీగా ఉన్న చెత్తాచెదారం



భాగ్యనగర్ 3వ లైన్‌లో శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు పక్కనే తగలబెడుతున్న చెత్త



ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలతో నిండిపోయిన పోతురాజుకాలువ

ఎస్సీ వర్గీకరణ తీర్పు చారిత్రాత్మకం



ఈదుమూడిలో కేక్ కట్ చేస్తున్న కొమ్మూరి కనకారావు



మాదిగల అమర స్థూపానికి నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

నాగులుప్పలపాడు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, వ్యవస్థాపక సభ్యుడు కొమ్మూరి కనకారావు మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన అంశమే అని సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో శుక్రవారం మండలంలోని ఈదుమూడిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, నేతలు స్వీట్లు పంచి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని మాదిగల అమరవీరుల స్థూపానికి వ్యవస్థాపక సభ్యులు, గ్రామస్తులు నివాళులర్పించారు. కనకారావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీలలోని అన్ని వర్గాల వారికి సమాన హక్కులు కల్పించాలని 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత సుప్రీంకోర్టు ధర్మాసనం రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకోవచ్చని ఇచ్చిన తీర్పు జాతి మొత్తానికి ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు కొమ్మూరి గరటయ్య, పేరిపోగు వెంకటేశ్వరరావు, కొమ్మూరి హైమారావు, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుతో ఈదుమూడి పులకరించింది



ఈదుమూడిలో అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న ఉసురుపాటి బ్రహ్మయ్య



సంతనూతలపాడులో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య

నాగులుప్పలపాడు: ఎస్సీ వర్గీకరణ న్యాయమైనదేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ గ్రామమైన మండలంలోని ఈదుమూడి గడ్డ పులకరించిందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. శుక్రవారం రాత్రి ఈదుమూడి గ్రామంలో బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని మాదిగ అమరవీరుల స్థూపం వద్ద ఎంఆర్‌పీఎస్ పోరాటంలో ప్రాణాలు విడిచిన నాయకులకు నివాళులర్పించారు. ఉద్యమం పుట్టిన ఈదుమూడి గడ్డను ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి ముద్దాడారు. అనంతరం వర్గీకరణ సాధించిన సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక సభ్యులు కొమ్మూరి గరటయ్య, ఇంటూరి రోశయ్య, నాయకులు రావినూతల కోటి, మల్లెల ప్రసాద్, ముంగర నాగార్జున, బోసు తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు శాంతినగర్‌లో...

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై సంతనూతలపాడు శాంతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు టీ ఆనంద్ మాదిగ పాల్గొని మాట్లాడారు. మండల ఎంపీపీ బీ విజయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని వారు అన్నారు. అనంతరం మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరించారు. ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు బొంతా ఏసుదాస్, అట్లూరి అశోక్, టీ చంద్రశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో లక్ష్యాలు సాధించాలి

- ఏడీఏ రమేష్‌బాబు

ఒంగోలు సెంట్రల్: గ్రామాల్లో ఎప్పటికప్పుడు రైతులకు సలహాలిస్తూ ఖరీఫ్ లక్ష్యాలు సాధించాలని ఒంగోలు ఏడీఏ బి.రమేష్‌బాబు సూచించారు. స్థానిక అగ్రికల్చర్ డివిజన్ అధికారి కార్యాలయంలో ఒంగోలు వ్యవసాయ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు వర్షపాతం వలన సాగైన పంటలపై చర్చించారు. ఈ-క్రాప్‌నకు బదులు త్వరలో ఈ-పంట ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అందులో సాగు రైతు వివరాలు సక్రమంగా నమోదు విధివిధానాలపై చర్చించారు. డివిజన్‌లో భూ పరీక్షలకు సంబంధించి 5,167 శాంపిల్స్ ఫలితాలు వచ్చాయని చెప్పారు. కౌలు రైతులకు కార్డులందేలా వేగవంతంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ సమ్మాన్ వెరిఫికేషన్ 80 శాతం పూర్తయిందని, మిగిలింది కూడా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఒంగోలు మండల వ్యవసాయాధికారి కిషోర్ బాబు, ఎంఈఓలు ఆదిమూర్తి, రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ రమేష్‌బాబు

ఆకట్టుకున్న ప్రవచనాలు

ఒంగోలు మెట్రో: పద్యసారస్వత పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక వీఐపీ రోడ్డులోని కార్యాలయంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ ప్రవచనంలో భాగంగా కుచేలోపాఖ్యానము ఘట్టాన్ని పింగళి రామమోహన రావు, శ్రీరామచంద్రుని శ్రీనివాసరావు చక్కగా ప్రవచించారు. వారి ప్రవచనానికి ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు భాగవత సప్తాహ ప్రవచనంలో భాగంగా చివరిరోజున రుక్మిణీ కళ్యాణ ఘట్టాన్ని పరిషత్ అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి తన ప్రవచనంతో సభికులను రంజింపజేశారు. ఈ కార్యక్రమానికి సంస్థ జాతీయ అధ్యక్షుడు పద్యభారతి చదలవాడ లక్ష్మీనరసింహారావు అధ్యక్షత వహించారు. కార్యదర్శి పింగళి పూర్ణచంద్రరావు సభా నిర్వహణ గావించారు. ఎ.కోదండరాం, జంధ్యాల కామేశ్వరి ప్రార్థనా గీతాన్ని ఆలపించారు. కోశాధికారి అనఘా వేంకటసుబ్బారావు, కార్యవర్గ సభ్యులు పింగళి శ్రీనివాసరావు, పింగళి రామమోహనరావు, రావినూతల వరలక్ష్మి, ప్రముఖ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి అగస్త్యరాజు శివ పాల్గొని పర్యవేక్షించారు.



రుక్మిణీ కళ్యాణ ఘట్టం ప్రవచనంలో మాగంటి శ్రీరామమూర్తి

రమణీయంగా సీతారాముల కళ్యాణం



కళ్యాణ వేదికపై ఆశీనులైన సీతారాములు

ఒంగోలు మెట్రో: నగరంలోని గుర్రంవారివీధిలో గల సీతారామస్వామి దేవస్థానంలో చతుర్థ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం సీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ ఆవరణలో చూడచక్కగా ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై సీతారాముల ఉత్సవమూర్తులను ఉంచి ప్రముఖ వేద పండితుడు చక్రవర్తి కళ్యాణాన్ని రమణీయంగా జరిపించారు. భక్తుల రామనామస్మరణ నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేవాలయ జీర్ణోద్ధరణ కమిటీ నిర్వాహకులు గుర్రం బదరీనారాయణ, గుర్రం శ్రీనివాసులు, పేర్ల రమేష్ కుమార్, బంటుపల్లి లక్ష్మీరాజ, నేరెళ్ల శ్రీనివాసరావు, గుర్రం రంగనాథ్, అధిక సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొని సీతారాముల అనుగ్రహానికి పాత్రులయ్యారు.

బస్‌పాస్‌లు, నోట్ పుస్తకాలు, సిమెంట్ బెంచీల బహూకరణ

కొత్తపట్నం: డాక్టర్ చాపల వంశీకృష్ణ సహకారంతో ఒంగోలు శ్రీరామ్ మల్టీసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బస్‌పాస్‌లు, నోట్ పుస్తకాలు, పాఠశాలకు సిమెంటు బెంచీలు బహూకరించారు. కొత్తపట్నం బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి హెచ్ఎం ఎం.శ్రీదేవి అధ్యక్షత వహించారు. 120 మంది బాలికలకు ఉచితంగా ఆర్టీసీ బస్‌పాస్‌లు, ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఫొటోలతో ప్రత్యేకంగా తయారు చేసిన 500 నోట్ పుస్తకాలు, సిమెంటు బెంచీలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ చాపల శాంతకుమారి, పిన్ని వెంకటేశ్వర్లు, చాపల చిరంజీవి, శ్రీరామ్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, పున్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



బస్‌పాస్‌లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్‌లు

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మారం

చీమకుర్తి: ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో మారం వెంకారెడ్డి ఫౌండేషన్ తరఫున శుక్రవారం చీమకుర్తిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తన తండ్రి మారం చినపేరిరెడ్డి 25వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీ జవహర్ మాట్లాడుతూ మారం వెంకారెడ్డి తన తండ్రి పేరు మీద క్రమం తప్పకుండా 25 సంవత్సరాల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తొలుత చినపేరిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ చైర్మన్ కడవా రామకృష్ణ, కౌన్సిలర్లు గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, పాటిబండ్ల గంగయ్య, సోమా శేషాద్రి, బడే అయ్యపరెడ్డి, ఆముదాలపల్లి రామబ్రహ్మం, పోకూరి రామకృష్ణారెడ్డి, బడే దశరథరామిరెడ్డి, పేరం శ్రీనివాసరావు, బండ్ల కొండలు, స్థానికులు పాల్గొన్నారు.

ఏకేయూ వీసీకి శుభాకాంక్షలు

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ డీవీఆర్ మూర్తిని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ రెక్టార్ ప్రొఫెసర్ వైపీ రామసుబ్బయ్య, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం లా విభాగం ప్రొఫెసర్ వీఆర్‌సీ కృష్ణయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన యూనివర్శిటీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారంటూ ప్రశంసించారు. వారి వెంట ఏకేయూ సీడీసీ డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు. మార్కాపురంలోని ఎన్ఎస్ లా కాలేజీ చైర్మన్ ఎన్.చంద్రమౌళి కూడా శుక్రవారం వీసీని ఆయన చాంబరులో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్శిటీ అభివృద్ధికి తమ వంతు సాయం తప్పకుండా అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



ఏకేయూ వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎన్‌యూ మాజీ రెక్టార్ రామసుబ్బయ్య